# సుచరిత

## కొర్రగంటి లక్ష్మీనరసింహారావు

మూడు ముళ్ళు...
ఏడు అడుగులు...
పది అడుగల పాతగది....
ఇదేనా జీవితమంటే....?

సుచరిత మెల్లిగా పక్కమీద లేచి కూచుంది. పక్కనే భర్త రామారావు గురకపెడుతూ గాఢ నిద్రలో వున్నాడు. వాతావరణం అంతా ప్రశాంతంగా వుంది. దూరంగా ఎక్కడో కుక్కలు మొరుగుతున్నాయి. గడియారం చేసే శబ్దం తప్ప గదంతా నిశ్శబ్దంగా వుంది. పిల్లలు ముగ్గురూ నిద్రబోతున్నారు.

సుచరితకుఅసహనంగా వుంది. అలజడిగా వుంది. ఆందోళనగా వుంది. ఏదో చెప్పరాని బాధతో ఆమె గుండె బరువెక్కింది. బాధగా నిట్టూర్చింది.

బాధ... బాధ... బాధ.

బరువు... బరువు... బరువు.

ఆమె బాధకి కారణం చక్రపాణి.

తను కష్టపడిపోతోందని సుచరిత అనుకుంటోంది. బాధల్లో వున్నానని భ్రమిస్తోంది. తను తప్ప ఈ ప్రపంచంలో ప్రతిమనిషీ సుఖంగానే బ్రతుకుతున్నాడని ఊహిస్తోంది.

తను అనుభవించేవి ఎలాంటి కష్టాలో, ఎలాంటి బాధలో ఆమెకి తెలీదు. జస్ట్ కష్టపడిపోతోంది. అంతే!

తన కష్టాల్ని కడ తీర్చేవాడు చక్రపాణి. దట్సాల్!

చప్పుడు కాకుండా తలుపు తీసి ఆరుబయటకు వచ్చింది. బయట వెన్నెల విరగకాస్తోంది. ఆ వెన్నె లంటే సుచరితకు ఎంతో ఇష్టం. వెన్నెలను చూడ గానే ఆమె గుండెను ఏదో మధుర భావం ఆనంద సాగరంలో ముంచివేస్తుంది.

వెన్నెల అనగానే ఆమెకు చక్రపాణి గుర్తుకొస్తాడు. కారణం చక్రపాణికీ వెన్నెలంటే ప్రాణం.

ఎందుకో - తనకు తెలియకుండానే ఫక్కుమని నవ్వింది సుచరిత. తెరలు తెరలుగా నవ్వింది. ఆ వెంటనే "నేల మీద చతికిలబడి భోరుమంది."

సుచరిత తండ్రి పేరు రామనాథం. రామ నాథానికి నలుగురు ఆడ పిల్లలు. ఒక్కడే మొగపిల్ల వాడు. ఆఖరి అమ్మాయి సుచరిత.

రామనాథం ఏదో మిల్లులో గుమస్తాగా పని చేసే వాడు. నాలుగైదు షాపుల్లో ఎకౌంట్స్ రాసే వాడు. వేణ్ణీళ్లకు చన్నీళ్ళుగా వుంటుందని ఆయన భార్య వేదవతి అప్పడాలు, సాంబార్ పొడి, చారుపొడి చేసేది. వాటిని పొట్లాలు కట్టి షాపుల్లో వేసేవాడు రామనాథం. ఆయనకి పిల్లలంటే వల్లమాలిన అభి మానం. సుచరిత అంటే ఆ అభిమానం పాలెక్కువ.

సుచరిత పుట్టాకే తనకు కలిసొచ్చిందని ఆయన నమ్మకం. తండ్రి నక్షత్రాన కూతురు పుడితే మహ ర్జాతకురాలౌతుందని అంటారు. తన నక్షత్రాన పుట్టిందని సుచరిత మహర్జాతకు రాలౌతుందని, కట్టు కున్నవాడు అదృష్ట వంతుడౌతాడని తరచూ అంటుండే వాడు రామనాథం.

సుచరితది మొదట్నుంచీ విచిత్రమైన మనస్తత్వం. ఆమెలో సరదా పాలెక్కువ. అల్లరి ఎక్కువ. కొంటె తనం ఎక్కువ. వీటన్నింటికి మించి ఆ పని చేయొద్దు అంటే అదేపని చేసేది. ఎందుకు చేశావంటే 'నా ఇష్టం చేస్తే ఏమైంది?' అనేది.

బళ్ళో మాస్టారు కుడిచేత్తో అక్షరాలు రాయాలి అంటే ఎందుకు? అని ఎడం చేత్తోనే అక్షరాలు రాయడం నేర్చుకుంది. కుడిచేత్తోనే అన్నం ఎందుకు తినాలి? ఏం ఎడం చేత్తో తినకూడదా? తల్లి తండ్రులు తిడతారని భయపడి ఎవరూ చూడకుండా ఎడంచేత్తో అన్నం తిని - 'తింటే ఏమైంది?' అనుకు నేది. ఇంతెందుకు - తల్లి తండ్రులు పాటించే నియమాలు - నిష్టలు - పరిహద్దులు ఏవీ సుచరితకు నచ్చవు.

సుచరిత-లోని ఈ విపరీత మనస్తత్వాన్ని మొదట తల్లిదండ్రులు పట్టించుకోలేదు. అలా పట్టించుకోక పోవడం తప్పని కూడా వారికి తెలీదు. ఏదో చిన్నపిల్ల - పెద్దదైతే అదే మారుతుందని వాళ్ళు అనుకుంటూ నవ్వుకునే వారు.

అదే వాళ్ళు చేసిన పొరపాటు.

అదే వాళ్ళ పీకలదాకా వచ్చింది.

సుచరిత పుష్పవతి అయ్యాక ఓ రోజు వేదవతి కూతురుని పిలిచి చెప్పింది.

"అమ్మాయ్! నువ్విప్పటి దాకా ఏం చేసినా - ఏమన్నా పట్టించుకోలేదు. ఇప్పటి నుంచి నువ్వు జాగ్రత్తగా వుండాలి. నీ పని నువ్వు చేసుకోవాలే తప్ప ఎవరి విషయాల్లోనూ జోక్యం చేసుకోకూడదు. ఎవరితో మాట్లాడకూడదు. ముఖ్యంగా మగపిల్లలతో...!

"మాట్లాడితే ఏమవుతుంది?" అని అనబోయి, తల్లి ఏమన్నా అంటుందేమో అని భయపడి సరే నన్నట్టు తలూపింది.

అంతే!

ఆ రోజు నించీ మగపిల్లలతో మాట్లాడితే ఏమౌతుందని స్కూల్లో కనపడ్డ ప్రతీ మగపిల్ల వాణ్ణి పిలిచి మరీ మాట్లాడేది.


స్కూల్లో సుచరిత గురించి గాలి కబుర్లు రేగడం మొదలు పెట్టాయి. అవి రామనాథం చెవుల పడ్డా పట్టించుకోలేదు. ఇది ఇరవైయ్యో శతాబ్దం. ఈ శతాబ్దంలో ఆడపిల్లలకు కూడా మగపిల్లలాగే స్వేచ్ఛ కావాలి. ఏదో మగపిల్లలతో మాట్లాడినంత మాత్రాన తప్పు పట్టటమేనా అని సరిపెట్టుకున్నాడు.

సరిగ్గా అప్పుడే—

"నువ్వెంత అందంగా వుంటావో తెల్సా?" అన్నాడు కుమార్ సుచరితతో.

ఆ మాటలు సుచరితకు కొత్తగా వున్నాయి.

ఆమె వోణీవేస్తున్న మొదటి రోజుల్లోనే ఆమె చుట్టూ వున్న మగజనం వెకిలిగా, దేబిరింపుగా, కక్కుర్తిగా, ఆరాధనగా చూడడం ఆమెకు తెలుసు.



ఆమెకు అదంతా సరదాగా వుండేది. జస్ట్ ఫన్నీగా వుండేది-దట్సాల్.

"నువ్వు కార్తీకపూర్ణిమ అంత అందంగా వుంటావు. తేనె, గంధం, నీరు, నిప్పులతో తయారైన అపురూప శిల్పంలా వుంటావు" అన్నాడు కుమార్.

నిజమా... అన్నట్టు చూసింది సుచరిత.

కుమార్ పొగడ్తలవల్లో, సుచరితలో వున్న విపరీతమైన మనస్తత్వం వల్లో - లేక ఆ వయస్సులో వున్న ఆకర్షణో... ఏది పని చేసిందో కాని ఓ రోజు సుచరిత ఇంట్లో వాంతులు చేసుకుంది.

కూతురు వాలకం చూసి వేదవతి గాభరాగా "దూరంగా వుండి ఎన్నాళ్ళయింది?" అని అడిగింది.

"మూడు నెలలు..."!

ఆ రోజు శుక్రవారం. పెద్దమ్మాయిని చూడ డానికి మగపిల్లవాడి తల్లిదండ్రులు వస్తున్నారు. వచ్చిన సంబంధం కుదిరితే అయిదు వారాలు సంతోషిమాత వ్రతాన్ని చేసుకుంటానని మొక్కుకుంది వేదవతి. ఆ రోజే వ్రతాన్ని మొదలు పెట్టింది. ఆ వ్రతం చేస్తున్న వాళ్ళు బాధపడకూడదు. ఏడవ కూడదు. కన్నీళ్ళు అసలే పెట్టుకోకూడదు. అది నియమం.

కూతురు చెప్పింది వినగానే వేదవతి తలమీద స్నానం చేసి వెళ్ళి పూజగదిలో వున్న సంతోషిమాత పటం ముందు బోర్లా పడిపోయింది.

వేదవతికి ఏడుపు తన్నుకొస్తోంది. కానీ, ఏడవ కూడదు. కన్నీళ్ళు పొంగుకొస్తున్నాయి. అయినా కన్నీరు పెట్టకూడదు.

అదో భయంకరమైన దుస్థితి.

మానవత్వం, కరుణ, జాలి, దయ వున్న వాళ్ళకు మాత్రమే ఆ తల్లి పరిస్థితి అర్థమవుతుంది.


ఈ విషయం బయటకొస్తే భర్త గుండె ఆగి పోతుంది. పెద్దపిల్లల పెళ్ళిళ్ళు కావు. కుటుంబం నవ్వుల పాలౌతుంది. పెళ్ళి చూపుల తతంగం అయిపోగానే, సుచరితని వెంట పెట్టుకుని పక్క వూళ్ళో వున్న తమ్ముడి దగ్గరికి వెళ్ళొస్తానని భర్తకు చెప్పి బయలుదేరింది.

దగ్గర్లో వున్న సిటీకి తీసుకెళ్ళి తెలిసిన డాక్టర్ దగ్గిర గుట్టుచప్పుడు కాకుండా అబార్షన్ చేయించి నాలుగు రోజుల తర్వాత యింటికి తీసుకొచ్చింది.

ఇక ఆ వూర్లో వుంటే లాభం లేదని కూతురు చదువు మాన్పించేసి, వైజాగ్‌లో వున్న మరో తమ్ముడి దగ్గరికి పంపించింది.

రెండు నెలలు గడిచాయి.

సుచరిత కనిపించడం లేదని తమ్ముడి దగ్గర్నుంచి టెలిగ్రాం రావడంతో అంతా ఇంటికి తాళం వేసి బయల్దేరారు.



వేదవతి అయితే వైజాగ్ చేరేదాకా దారి పొడవునా ఏడుస్తూనే వుంది. రామనాథం అయితే శిలే అయిపోయాడు.

వీళ్ళు అక్కడికి చేరేసరికి మరో కొత్త విషయం తెలిసింది వేదవతికి. ఆమె తమ్ముడు వాళ్ళు వుంటున్న యింటిపక్కనే వుంటున్న రామారావు కూడా కనిపించడం లేదని.

రామనాథం హతాశుడయ్యాడు.

వారం రోజుల తర్వాత సుచరిత, రామారావులు ఇద్దరూ పెళ్ళి బట్టలతో దిగారు.

కూతురు ఎవరికీ చెప్పకుండా పెళ్ళి చేసుకుందన్న మాట వినగానే వేదవతి స్పృహ తప్పి పడిపోయింది. రామనాథం మంచమెక్కాడు.

ఆ తల్లిదండ్రుల బాధంతా ఒక్కటే - ఆఖరి కూతురు పెళ్ళి చేసుకుంటే, పెళ్ళికాని పెద్ద ఆడ పిల్లల భవిష్యత్తు ఏమౌతుందని!

ఆ తర్వాత కాలాన్ని బట్టి వీళ్ళ పెళ్ళి తల్లి దండ్రులు అంగీకరించారు. పెద్ద పిల్లల పెళ్ళిళ్ళు ఎలాగో జరిగిపోయాయి.

సుచరితకి ముగ్గురు పిల్లలు పుట్టారు. పెద్ద పిల్లలిద్దరూ ఆడపిల్లలు. మూడో కాన్పుల్లో మగ పిల్లవాడు పుట్టాడు.

రామారావు ఏదో ఆఫీసులో చిన్న ఉద్యోగం చేస్తున్నాడు. వచ్చేది గొర్రె తోకలాంటి జీతం. ఎదుగూ బొదుగూ లేదు. మూడో తారీఖు వచ్చేటప్పటికీ జీతం అంతా అయిపోయేది. ఆ తర్వాత చేబదుళ్ళు, అప్పులు ఇబ్బందులు సరేసరి!

ఇలా వుండగా—

రామారావు వుంటున్న ఇరుకు గది పక్కనే వున్న ఇంట్లో ఓ బ్రహ్మచారి వుంటున్నాడు. అతడి పేరు చక్రపాణి.

ఓ రోజు రామారావు ఆఫీసుకు వెళ్ళగానే "ఎక్స్‌క్యూజ్‌మీ మేడం, కొంచెం కాఫీపొడి వుంటే ఇస్తారా?" అని అడిగాడు చక్రపాణి.

సుచరిత కాఫీపొడి ఇచ్చింది.

తెల్లవారి కాఫీ పొడి తిరిగి యిచ్చేస్తూ "థాంక్స్" అన్నాడు. అలా అంటున్నప్పుడు అతనికళ్ళు సుచరితను చూసి తళుక్కుని మెరవటం సుచరిత గమనించి నవ్వుకుంది. ఆ రోజునించి ఆమె బొట్టులో మార్పు వచ్చింది. చీరకట్టులో మార్పువచ్చింది.

రెండు రోజులాగి మళ్ళీ కాఫీ పొడి అడిగాడు చక్రపాణి. సుచరిత యిచ్చింది.

మళ్ళీ అడిగాడు. మళ్ళీ మళ్ళీ యిచ్చింది.

మళ్ళీ అడిగాడు. ఇచ్చింది.

"ఏంటి? మీరసలు కాఫీ పొడికొంటమే మానేశారా?" నవ్వింపుగా అడిగింది.

"ఏం చేయమంటారు? మీ చేత్తో యిచ్చిన కాఫీ పొడి రుచే వేరు. అద్భుతంగా వుంటోంది. అందుకే..." చిన్నగా అన్నాడు చక్రపాణి.

అదీ మొదలు—

ఆ తర్వాత వాళ్ళ పరిచయం చాలా వేగంగా అభివృద్ధి చెందింది.

ఉదయం తొమ్మిది గంటలు కాగానే రామారావు ఆఫీసుకు వెళ్ళిపోయేవాడు. పిల్లలు స్కూల్‌కి వెళ్ళే

వాడు. ఆ వెంటనే చక్రపాణి రామారావు ఇంట్లోకి దిగిపోయే వాడు. సుచరిత చక్రపాణికి ఇష్టమైన వంటకాలన్నీ చేసి పెట్టేది. మాట్నీలు, మార్నింగ్ షోలు, దేవుడి గుళ్ళు, పార్కులు - ఒకటేంటి వాళ్ళిద్దరూ తిరగని ప్రదేశమంటూ లేదు.

ఓ రోజు చక్రపాణి అడిగాడు సుచరితని "ఇంత దరిద్రాన్ని ఎలా భరిస్తున్నావు?"

సుచరిత మౌనంగా వుండి పోయింది.

"ఎన్నాళ్ళయింది మీ పెళ్ళయి?"

"పదేళ్ళయింది"

"పదేళ్ళా? ఐ పిటీ యూ" పదేళ్ళ నించి యింత నరకాన్ని భరిస్తున్నారన్న మాట!"

మళ్ళీ సుచరిత మౌనంగా వుండి పోయింది.

"నువ్వు ఈ యింట్లో నుసిగుడ్డలో దాక్కున్న మాణిక్యంలా అయిపోయావు. నువ్వు ఏ లక్షాధికారికో పెళ్ళామవ్వ కావల్సిన దానివి. రామారావు దగ్గర ఏముంది? పిడికెడు బూడిద - కడివెడు కన్నీళ్ళు... అంతేగా..."

నిజమేననిపించింది సుచరితకు.

రామారావు పొద్దున ఇంటి నుంచి బయట పడితే మళ్ళీ రాత్రి ఏ పదింటికో ఇల్లు చేరుకునే వాడు. వచ్చే జీతం చాలక ఆఫీసు వదిలాక రెండు చోట్ల పార్ట్ టైం పని చేస్తున్నాడు.

తను ప్రేమించి పెళ్ళి చేసుకుందని, తన కోసం సుచరిత చాలా త్యాగం చేసిందని అతడి నమ్మకం. ఆమెని కష్టపడకుండా చూసుకోవాలని అతడెప్పుడూ మనసులోనే అనుకునేవాడు. కానీ,ఎప్పుడూ బయట పడలేదు.

ఆ రోజున సుచరిత పుట్టిన రోజు "సాయంత్రం త్వరగా యింటికి వచ్చేస్తారుగా" రామారావు ఆఫీసుకి బయలు దేరుతుంటే అడిగింది సుచరిత.

"ఏంటి విశేషం?" అడిగాడు రామారావు.

"మీకు వున్న కొద్ది మతిమరుపు ఎక్కువౌతుంది. ఇవాళ నవంబర్ పదకొండు. నా పుట్టిన రోజు!"

"సారీ... మర్చిపోయాను. నాలుగింటి నరకల్లా మళ్ళీ వస్తా..." అని ఆఫీసుకి బయల్దేరాడు.

ఆఫీసులో—

రామారావు పర్మిషన్ లెటర్ చూసి అడిగాడు ఆఫీసర్ "ఎందుకు పర్మిషన్?"

"ఇంటి దగ్గర పనుంది"

"ఏంటాపని..."

"నా భార్య పుట్టిన రోజు అందుకే..." నసుగుతూ అన్నాడు రామారావు.

"హ... హ... హ..." ఏదో వినకూడదని మాట విన్నట్టు ఫెళ్ళున నవ్వాడు ఆయన.

ఆ ఆఫీసర్ నక్షత్రం, ఆయన భార్య నక్షత్రాలని బట్టి ఆయన పిల్లి అయితే భార్య ఎలుక. ఆయన ఏనుగైతే ఆమె సింహం. ఇంట్లో ఒక్క క్షణం ఒకరి కొకరికి పడదు. భార్య పోరు పడ లేక ఎక్కువ కాలాన్ని ఆఫీసులోనే ఖర్చు పెట్టేస్తాడు. ఆయనకి రామారావు సరదాగా గడపడం యిష్టం లేక పోయింది. శాడిజం.

సరిగ్గా నాలుగింటికి ఆ పని చెప్పాడు. అది అయిపోగానే ఈ పని చెప్పాడు. రాత్రి ఎనిమిదింటి దాకా ఏదో ఒక పని చెప్పి చేయించి "మిస్టర్ రామారావ్ - అన్నట్టు నీ భార్య పుట్టిన రోజన్నావు కదూ... ఇక నువ్వు వెళ్ళొచ్చు..." అన్నాడు.

రామారావు ఉసూరుమంటూ రెండు బస్సులు మారి ఇంటికి చేరుకున్నాడు. అప్పటికి రాత్రి తొమ్మిదిన్నర దాటింది.

రామారావు యింటికి వెళ్ళే సరికి అప్పుడే సుచరిత తలుపుతీస్తుంది. భర్తను చూడగానే ముఖం మాడ్చుకుంది.

"ఎక్కడికి వెళ్ళావు?" అడిగాడు.

"మీ కోసం చూసి చూసి గుడికి వెళ్ళొస్తున్నాను" అంది సుచరిత.

నిజానికామె సాయంత్రం ఆరింటి దాకా భర్త కోసం ఎదురు చూసిన మాట నిజమే. ఆరు దాటగానే పిల్లల్ని తీసుకుని చక్రపాణితో సినిమాకు వెళ్ళి పోయింది. తను యిలా పరాయి మగాడితో సినిమాలూ, షికార్లకూ తిరగడానికి కారణం భర్తే అని తనని తాను సంబాళించుకుంది. తను దిగజారుతున్నదని, తను చేస్తున్నది తప్పని ఆమెకి తెల్సు. కానీ ఆ తప్పు తనది కాదు. తనని సరిగ్గా చూసుకోని భర్తది అని అందంగా ఆత్మవంచన చేసుకుంది.

రెండు నెల్లు గడిచాక - ఓ రోజు చక్రపాణితో సరదాగా అంది "త్వరగా పెళ్ళి చేసుకోరాదు? ఈ చేతులు కాల్చుకునే బాధ తప్పుతుందిగా!"

"నీ అంత అందమైన అమ్మాయివుంటే చూడు. పెళ్ళి చేసుకుంటాను"

ఏంటి? తను అందంగా వుంటుందా? పెళ్ళయిన పదేళ్ళలో మొదట్లో తప్ప ఎప్పుడూ తన అందాన్ని భర్త పొగిడిన పాపాన పోలేదు.

"నిజం సుచరితా! ప్లీజ్ నా మాట విను! నువ్వు నాతో వచ్చెయ్. నిన్ను పెళ్ళి చేసుకుంటాను. పువ్వుల్లో పెట్టి చూసుకుంటాను"

"మరి పిల్లలు?"

"పిల్లల్ని కూడా తీసుకొచ్చెయ్"

"నాకు ఆపరేషన్ ఐంది. ఇక నాకు పిల్లలు పుట్టరు"

"ఫర్వాలేదు - నీ పిల్లల్నే నా పిల్లలుగా చూసుకుంటాను. నాకు పెళ్ళి కాదని కాదు. నీకు ఈ నరకం నించి విముక్తి కలిగించడమే నా వుద్దేశ్యం. నువ్వు రానంటే జీవితాంతం నేను పెళ్ళి చేసుకోకుండానే వుండి పోతాను. నువ్వు కాదంటే చచ్చి పోతాను"

ఇదంతా గతం —

ప్రస్తుతం సుచరిత తల ఆలోచనలతో వేగిపోతోంది. తను చక్రపాణితో వెళ్ళిపోతే అంతా లేచిపోయిందని అంటారు. అంటే ఏంటి? తను సుఖపడుతుంది. కావల్సిందంతే! ఈ పదేళ్ళలో తనేం సుఖపడింది?

అలా ఎంతసేపు కూచుందో ఆమెకి తెలీదు. నిద్ర వస్తే స్పృహ కోల్పోయినట్టనిపించి నెనక్కి వెళ్ళి పక్కమీద వాలిపోయింది.

అప్పటికప్పుడే ఓ నిర్ణయానికి వచ్చేసింది.

వారం రోజుల తర్వాత —

ఆ రోజు రామారావు పెళ్ళి రోజు. సాయంత్రం ఆఫీసు వదలగానే మల్లెపూలు, స్వీట్స్, పళ్ళు కొనుక్కుని త్వరత్వరగా యిల్లు చేరుకున్నాడు. ఇంటికి తాళం వేసుంది. పిల్లలు కూడా లేరు. ఏ సినిమాకైనా వెళ్ళుంటుందేమోనని అర్ధరాత్రిదాకా ఎదురు చూశాడు. తెల్లారిపోయింది. అయినా సుచరిత జాడ లేదు.

ఎందుకో అనుమానం వచ్చి ఇల్లంతా పరీక్షగా చూశాడు. పెట్టె తెరిచి చూశాడు. పిల్లల బట్టలు, భార్య బట్టలు, నగలు ఏమీ లేవు.

ఆగ మేఘాల మీద మామగారికి టెలిగ్రాం ఇచ్చి పిలిపించాడు. ఆయన రాగానే ఇద్దరూ కల్సి పోలీసు రిపోర్ట్ యిచ్చారు.

మరో పది రోజుల తర్వాత సుచరిత చక్రపాణితో


వింతలు - విశేషాలు

## మూగవోయిన కప్పలు

కప్పల కాళ్ళ ఎగుమతిని ఈ మధ్య కేరళ ప్రభుత్వం నిషేధించింది. అంటే కేరళ ప్రభుత్వానికి 20 కోట్ల విదేశీ మారకం తగ్గిపోయిందన్నమాట.

అసలు కప్పలు మనకు భగవంతుడు ప్రసాదించిన వరమే మరి! కప్పల బెకబెకల ధ్వనుల్ని రికార్డు చేసి వాటిని పాశ్చాత్య సంగీత ధ్వనుల్లోకి మలచుకుంటున్నారు. రోజు రోజుకూ కప్పల కాళ్ళు తినేవారి సంఖ్య బాగా పెరిగిపోతోంది. అలా మనం సహజ సంగీత ధ్వనులకు కూడా దూరమవుతున్నాం. అందుకే ప్రభుత్వం కప్పల కాళ్ళమీద నిషేధం విధించింది.

అయితే, ఈ నిషేధం కప్పల ప్రాణాలను మాత్రం కాపాడలేకపోతున్నది. దొంగతనంగా కప్పల కాళ్ళను విదేశాలకు పంపించే వ్యాపారం మాత్రం కొనసాగుతున్నది. కేరళ ప్రాంతంలో ఇదో పెద్ద స్మగ్లింగ్. ఇప్పుడు కప్పల కాళ్ళను ఆరగిస్తూ పాశ్చాత్య సంగీతాన్ని గ్రోలే పాశ్చాత్య సంగీత ప్రియులకు కప్పల కాళ్ళలేని కొరత ఇంతా అంతా కాదంటున్నారు.



అందుకే ఈ స్మగ్లింగ్.

కాగా, మన కప్పల సంపద మాత్రం తరుగుతున్నది. కేరళకు విదేశీ మారకం తగ్గిపోయింది. మరి కేరళ ప్రభుత్వం కప్పల ఎగుమతిపై నిషేధం తొలగిస్తుందా? వేచి చూడాలి.

— ఎ. పండరీనాథ్

కలిపిపట్టుబడింది. రామారావు విర్భాంతపోయాడు. తన భార్య లేచిపోవటమా? ముగ్గురు పిల్లల తల్లి, తనతో పదేళ్ళ పాటు కాపురం చేసిన సుచరిత లేచి పోవడమా?

సుచరిత చక్రపాణి దేవుడంది. మహాత్ముడంది. తన ఈ దుస్థితికి భర్తే కారణం అంది. తన భర్త అసమర్థుడంది. పనికిరాని వాడంది. తనని, పిల్లల్ని పట్టించుకోడంది. ఇన్నాళ్ళూ తాము చేసింది కాపురమే కాదంది. ఈ పదేళ్ళలోనూ నేనేం సుఖ పడ్డానంది. చక్రపాణిని రక్షించటానికి - చక్రపాణిదేం తప్పలేదు. అతను నన్ను తీసుకెళ్ళడం కాదు — నేనే ఆయన్ని తీసుకెళ్ళాను అని పోలీసులకు స్టేట్‌మెంట్ రాసి మరీ యిచ్చింది.

రామనాథం కూతురి వాలకం చూసి తల బాదుకున్నాడు. నోరు బాదుకున్నాడు. ఇంటికి తీసుకెళ్ళి నచ్చచెప్తే కూతురు దారిలోకి వస్తుందని సుచరితను ఇంటికి తీసుకెళ్ళిపోయాడు.

ఓ ఫైన్ మధ్యాహ్నం — అక్కడ్నించి పిల్లల్ని తీసుకుని మాయమైంది సుచరిత.

** ** **

"ఇదీ సుచరిత కథ! దయచేసి ఈ కథ రాయండి" అన్నాడు కైలాష్.

అంతవరకు కథ వింటంలో లీనమైపోయిన నేను కళ్ళు తెరిచాను. కైలాష్ కళ్ళు ఎర్రబడి వున్నాయి. కుర్చీలో చేరగిలబడి ఎటో చూస్తున్నాడు.

కైలాష్ నేనూ ఒక ఆఫీసులో పనిచేస్తున్నాం. కైలాష్‌ది చాలా రఫ్ కారెక్టర్. చాలా నిర్లక్ష్యంగా వుంటాడు. అతడి కళ్ళలో ఎప్పుడూ కసి వుంటుంది. అది ఎవరిమీదో తెలీదు. ఎందుకు తెలీదు. కసి! అంతే!

మేం పనిచేసే ఆఫీస్‌లో ఎం.డి. కూడా కైలాష్‌ని చూసి భయపడతాడు. కారణం అతని రష్‌నెస్!

"ఇది ఎవరి కథ?"

"ఎవరి కథ అయితే ఏంటిసార్! ఇది ఆడదాని చేతిలో మోసపోయిన ఓ అభాగ్యుడి కథ. వాస్తవాన్ని మరచి కలల్లో తేలిన ఓ అభాగ్యురాలి కథ. ఇది వాళ్ళిద్దరికీ పుట్టిన దురదృష్టపు పిల్లల కథ! ప్లీజ్! మీరు తప్పకుండా రాయండి!"

"ఉహు... నేను రాయను"

దెబ్బతిన్నట్టు చూశాడు కైలాష్.

"ముందు ఈ కథలో సుచరితకు, మీకు ఏం సంబంధం వుందో చెప్తే రాస్తాను."

కైలాష్ మెల్లిగా కుర్చీలోంచి లేచి నిలబడ్డాడు. రెండు సార్లు గదిలో అటు యిటు తిరిగాడు. సిగరెట్ వెలిగించి బూట్లు తొడుక్కున్నాడు. గుమ్మం వరకు వెళ్ళి, వెనక్కి తిరిగొచ్చి మళ్ళీ కుర్చీలో కూచున్నాడు.

"మీరడిగిందానికి సమాధానం నేను తర్వాత చెప్తాను. ఈ కథకు ముగింపు ఏమిద్దామనుకుంటున్నారు?" కైలాష్ అడిగాడు.

"అది కూడా మీరే చెప్పండి" అన్నాన్నేను.

"సుచరిత చక్రపాణి దగ్గరికే మళ్ళీ వెళ్ళిపోయింది. నేను చెప్పక్కర్లేదనుకుంటా. ఆమె అతనితో వెళ్ళిపోయాక ఆరునెల్లు సుఖంగానే గడిచాయ్. ఆ తర్వాత చక్రపాణి నిజ స్వరూపం బయటపడింది. ప్రేమించి పెళ్ళిచేసుకున్న భర్తనే పదేళ్ళ తర్వాత వదిలి నాతో వచ్చేశావు. నా దగ్గర ఎన్నాళ్ళుంటావు అన్నాడు. నేను నిన్ను ఎలా నమ్మాలి? అన్నాడు. ఆఫీసుకు వెళ్ళినా, నువ్వు మీ ఆయన ఆఫీసుకి వెళ్ళగానే నాతో కథ నడిపినట్లు - ఇంకెవరితో నన్నా ఇప్పుడు కథ నడపవని గ్యారంటీ ఏమిటి? అన్నాడు. ఇంకా చాలా చాలా అన్నాడు. తిట్టాడు. కొట్టాడు. పీకపిసికి చంపడం తప్ప అన్నీ చేశాడు.

అప్పటికి గాని సుచరితకు తెలిసిరాలేదు. తను చేసింది ఎంత పొరపాటో!

ఆమె ఇప్పుడు పుట్టింటికి వెళ్ళలేదు. భర్త దగ్గరకు వెళ్ళలేదు. మరి ఎక్కడికి వెళ్ళాలి? రెండేళ్ళు గడిచాక పిల్లల్ని తీసుకుని భర్త దగ్గరకు వచ్చింది.

"నన్ను క్షమించండి! మీకు ద్రోహం చేశాను" అని కరువుతీరా ఏడుద్దామనుకుంది. కానీ, ఆ అదృష్టంకూడా ఆమెకు లేదు.

"ఏమైంది?" ఆత్రుతగా అడిగాను.

చేతిలో చివరంటా కాలిన సిగరెట్‌ను ఏష్‌ట్రేలో కుక్కి మరో కొత్త సిగరెట్ వెలిగించాడు కైలాష్. చిన్నగా ఆవులించి మళ్ళీ చెప్పసాగాడు.

"సుచరిత వచ్చేసరికి రామారావు మెంటల్ హాస్పిటల్‌లో వున్నాడు. దారుణమైన విషయమేమిటంటే కూతురు మళ్ళీ తన దగ్గర్నుంచి వెళ్ళిపోగానే ఆమె తండ్రి హార్ట్ ఎటాక్‌తో ఆ రాత్రే చని పోయాట్ట."

"మైగాడ్..." పైకే అనేశాను "ఇప్పుడు సుచరిత ఎక్కడ వుంది?"

"ఇక్కడే వుంది... లేచిపోయిన దాని కూతుళ్ళు కాబట్టి ఆమె కూతుళ్ళకు పెళ్ళిళ్ళు కావు. కొడుకు - అఫ్‌కోర్స్ - మగాడు కాబట్టి ఏదో వుద్యోగం చేస్తున్నాడనుకోండి. సుచరిత మాత్రం రోజూ - పది సంవత్సరాల నుంచి ఏడుస్తూనే వుంది. నిజానికామె ఎప్పుడో చనిపోయేది. ఒకే ఒక్క కారణం ఇంకా ఆమెని బతికిస్తోంది."

"ఏంటది?"

"తన భర్త ఏనాటికయినా పిచ్చి తగ్గి హాస్పిటల్ నుంచి వస్తాడని ఆమె నమ్మకం. వచ్చాక భర్తకి నాలుగే నాలుగు మాటలు చెప్పాలనుకుంటోంది. 'క్షమించండి...' నేను మీకు ద్రోహం చేశాను... ఈ ద్రోహిని క్షమించండి..."

నిశ్శబ్దం —

చీమకాళ్ళు నిరిగితే వినిపించేంతటి భయంకరమైన నిశ్శబ్దం ఆ గదిలో.

పది నిమిషాలకి కైలాష్ కుర్చీలోంచి లేచి 'గుడ్ నైట్' అంటూ గది బయటకు నడిచాడు.

గేటు దాకా వెళ్ళి అతన్ని సాగనంపుతూ అడిగాను "ఇంతకీ — సుచరితకు మీకూ వున్న సంబంధం ఏమిటో చెప్పనేలేదు."

"ఆమె నా తల్లి..." అంటూ వేగంగా వెళ్ళిపోయాడు కైలాష్.

నా చుట్టూ మహార్ణవం లాంటి మాయా శూన్యం.



# ప్రపంచపదులు



85

నమ్మిన నేస్తం స్నేహం పొదుగును కుమ్మితె నరకం
శీలం ముఖాన నిందల బురదను చిమ్మితె నరకం.
మనసును కాల్చే బాధకు నరకం మరో పేరులే—
పుచ్చిన నాలుక ఇంతని అంతని పొగిడితె నరకం.
నీచుడు వేసిన దండను మెడలో నిలిపితె నరకం.

86

మాటల కోటలు కూల్చే బాణం మౌనం.
మనిషికి మననం నేర్పే జ్ఞానం మౌనం.
మౌనం లోతులు మాటల కందవు లేవోయ్—
మగతల పొరలను చీల్చే మథనం మౌనం.
మనసుకు వెలుగును చూపే నయనం మౌనం.

— డాక్టర్ సి.నారాయణరెడ్డి